సంబురాల్లో మునిగిన బీఆర్ఎస్ శ్రేణులు

అచ్చంపేట, అక్టోబర్ 15: అచ్చంపేట బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు సీఎం కేసీఆర్ ఆదివారం బీఫాం అందజేశారు. అనంతరం సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టో ప్రకటించారు. మూడోసారి బీఫాం అందుకున్న అనంతరం అచ్చంపేట ప్రాంతంలో బీఆర్ఎస్‌శ్రేణులు సంబురాలు జరుపుకొన్నారు. ఆయా మండలాలు, గ్రామాల్లో పటాకులు కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు.

నేడు బైక్‌ర్యాలీ..

ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోవసారి బీఫాం అందుకొని సోమవారం అచ్చంపేటకు వస్తున్నందున బీఆర్ఎస్‌శ్రేణులు ఘనంగా స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్నారు. అచ్చంపేటలో బైక్‌ర్యాలీ నిర్వహించనున్నారు. గువ్వల బాలరాజును మూడోసారి గెలిపించుకొని సీఎం కేసీఆర్‌కు కానుకగా అందిస్తామని బీఆర్ఎస్‌శ్రేణులు ప్రకటించారు. సీఎం కేసీఆర్ మొదటివిడుతలో గువ్వలకు బీఫాం అందజేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

లింగాలలో..

లింగాల,అక్టోబర్ 15: ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజుకు బీ ఫాం అందజేయడంపై మండల బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సుధీర్‌గౌడ్,మాజీ జెడ్పీటీసీ మాకం తిరుపతయ్య, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కేటీ రుపతయ్య, సింగిల్ విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఆర్ఎస్ అభ్యర్థిగా బీఫాం తీసుకోవడంతో ముచ్చటగా మూడోసారి గువ్వల గెలవడం ఖాయమని అన్నారు. అదేవిధంగా సోమవారం హజీపూర్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి స్వాగతం పలకాలని కోరారు. కార్యకర్తలు బైక్ తీసుకొని అచ్చంపేటకు చేరుకోవాలని కోరారు.

పదర లో పటాకులు కాల్చి సంబురాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

అమ్రాబాద్‌లో...

ఉప్పునుంతలలో..

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

అచ్చంపేలో బాలత్రిపుర సుందరిగా అమ్మవారు

■ బాల త్రిపురసుందరిదేవీగా ..

అచ్చంపేట టౌన్, అక్టోబర్ 15: బాలత్రిపురసుందరిదేవీ అవతారంలో అమ్మవారు దర్శనిమిచ్చారని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవీ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు ఈ నెల 23 వరకు గాయత్రీదేవి, అన్నపూర్ణాదేవి, మహాలక్ష్మి దేవి, లలితాదేవి, సరస్వతీ దేవి, రాజరాజేశ్వరీ దేవి, కనకదుర్గా దేవి, మహిశాసురమర్ధని దేవి, రజతకవచ కన్యకాపరమేశ్వరి దేవిగా దర్శనమిస్తుందని తెలిపారు. నవరాత్రి ఉత్సవాలు భాగంగా అమ్మవారికి కుంకుమార్చన, మహానివేదన, మహామంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరుగునని తెలిపారు. వివిధ రకాల పుష్పాలతో, విద్యుద్దీపాల అలంకరణతో అమ్మవారికి అలంకరిస్తారని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పాపిశెట్టి బాలరాజు, కోశాధికారి కామిశెట్టి శ్రీనివాసులు, కర్ణస్వామి, నరసింహారావు, మిర్యాల విజయకుమార్, కటకం భాస్కర్, విసనకర్రల చంద్రకుమార్, పొలిశెట్టి నరేశ్, వాడకట్టు వినోద్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బల్మూరులో

బల్మూరు,అక్టోబర్15: దేవీ నవరాత్రి ఉత్సావాల్లో భాగంగా ఆదివారం బాలాత్రిపురదేవిగా అమ్మవారు మొదటి రోజూ భక్తులకు దర్శనం ఇచ్చింది. మండలంలోని జినుకుంట, గోదల్, మహాదేవుపూర్, మంగళకుంటపల్లి, తుమ్మెన్‌పేట, కొండనాగుల, బల్మూరు, పొలిశెట్టిపల్లి గ్రామమ్లా అమ్మవారి మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలను చేశారు. మండపం వద్ద భక్తులు అన్నదాన కార్యక్రమం చేశారు. రాత్రి సమయంలో భక్తులు అఖండ భజనలు, కోలాటాలతో నృత్యాలు చేయడంతో పండుగ వాతావరణం కనిపించింది.

జాతీయస్థాయి ఖోఖోకు ఎంపికైన జిల్లా విద్యార్థులు

ఖోఖోలో పాల్గొన్న విద్యార్థులు

నాగర్‌కర్నూల్, అక్టోబర్ 15 : ఆదివారం వనపర్తి జిల్లా ఘణపురం మండలం సోలిపూర్‌లో నిర్వహించిన 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 విభాగం ఖోఖో క్రీడల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తరపున పాల్గొని చక్కటి ప్రదర్శన ఇచ్చారు. హైదరాబాద్ జిల్లా జట్టును ఓడించి మొదటి బహుమతి సాధించి జాతీయ ఖోఖో జట్టుకు నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మహాత్మ జ్యోతిబాపులే గురుకుల పాఠశాల విద్యార్థులు హేమలత, శ్రావణి లు ఎంపికయ్యారని జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి పాండు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో 67వ స్కూల్ గేమ్ ద్వారా నిర్వహించిన వివిధ క్రీడల్లో నాగర్‌కర్నూల్ జిల్లా విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థులు హేమలత, శ్రావణిలు ఎంపిక కావడం వల్ల విద్యార్థులను డీఈవో గోవిందరాజులు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పాండు, ఎస్‌పీసీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్ వెంకటయ్య సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ప్రకాశ్, సమరమేశ్, పురంరమేశ్, కృష్ణ అభినందించారు. క్రీడాకారులను తయారుచేసి జాతీయస్థాయికి ఎంపికయ్యేటట్లు చేసిన పాఠశాల పీఈటీని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్ కార్యదర్శి పాండు, ప్రసాద్‌గౌడ్ వెంకటయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ల్యాప్రో స్కోపిక్ పద్ధతి ద్వారా కణతి తొలగింపు

నాగర్ కర్నూల్, అక్టోబర్ 15 : జిల్లా కేంద్రంలోని ప్రగతి నర్సింగ్ హోమ్‌లో ఆదివారం ఓ మహిళ గర్భసంచి నుంచి మూడు కిలోల కణతిని లాప్రోస్కోపి పద్ధతి ద్వారా తొలగించారు. తెలకపల్లికి చెందిన ఇందిరమ్మ అనే మహిళ గర్భ సంచి నుంచి మూడు కిలోల కణితిని లాప్రోస్కోపిక్ పద్ధతి ద్వారా తొలగించినట్లు సర్జన్ డాక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. మహిళ రక్తహీనతతో ఐదు మిల్లీగ్రాముల రక్తంతో బాధపడుతూ తమను ఆశ్రయించడం జరిగిందని ఆమెకు రక్తమెక్కించిన తర్వాత లాప్రోస్కోపిక్ పద్ధతిలో ఈ ఆపరేషన్ నిర్వహించి కణితిని తొలగించారు. అనస్తీషియా డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ నూర్జహాన్, డాక్టర్ స్వరూపారాణిలు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

ఎక్సైజ్ దాడులు నాటుసారా పట్టివేత

అచ్చంపేట రూరల్, అక్టోబర్ 15 : మండలంలోని సిద్ధాపూర్ గ్రామశివారులోని చౌరస్తాలో ఆదివారం రూట్‌వాచ్ నిర్వహించి దాడులు చేయగా సూర్యతండా గ్రామానికి చెందిన తార్య మన్ననూర్‌కు సారా తరలిస్తు పట్టుబడడంతో కేసు నమోదు చేసి సారా, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సూర్యతండాకు చెందిన తార్య మద్యం ప్లాస్టిక్ బాటిళ్లలో 24 లీటర్ల నాటుసారాను బైక్‌పై తరలిస్తుండగా అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై బాలరాజు, సతీశ్ కుమార్, ఉషారాణి సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలు దుర్మరణం

కోడేరు, అక్టోబర్ 15 : ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలు దుర్మరణం చెందిన ఘటన మండలంలోని జనుంపల్లి మంత్రాలమ్మ ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. గ్రామస్థులు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని తీగలపల్లికి చెందిన జనమోని ఈశ్వరమ్మ (60) జనుంపల్లి శివారులో పొలంలో మొక్కజొన్న పంటను సాగుచేశారు. మూడురోజుల కిందట మొక్కజొన్న పంటను కోతలుకోసి మక్కలను మంత్రాలమ్మ ఆలయం వద్ద రోడ్డుపై ఆరబోశారు. ఆదివారం సాయంత్రం ఈశ్వరమ్మ మక్కలను ఆరబెట్టి వస్తుండగా నాగర్‌కర్నూల్ వైపు నుంచి ఓ ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి వృద్ధురాలిని ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. మృతురాలికి భర్త మంతయ్య, కుమారుడు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై శేఖర్‌రెడ్డి పరిశీలించి కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.